మరాఠా కోటా కోసం
మరో యువకుడి ఆత్మహత్య

ఛత్రపతి శంభాజీనగర్, నవంబర్ 14: మరాఠా రిజర్వేషన్ల కోసం మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఛత్రపతి శంభాజీనగర్ నగరంలో చోటుచేసుకున్నది. మర్డాక్ గ్రామానికి చెందిన దజీబా రాందాస్ కదమ్ (23) ఈ నెల 11న ఓ పని మీద నగరానికి వచ్చాడు. అనంతరం విషాన్ని తాగాడు. ఇది గుర్తించిన స్థానికులు అతడిని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ 12న మరణించాడు. మృతుడి వద్ద ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 'నాకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉన్నది. ఏక్ మరాఠా.. లాక్ మరాఠా' అని రాసి ఉన్నది.

కెనడాలో దీపావళి వేడుకలపై
ఖలిస్థానీ ఉగ్రవాదుల దాడి

టొరంటో: కెనడాలో సిక్కు వేర్పాటువాదులు రెచ్చిపోతున్నారు. ఆ దేశ ప్రభుత్వం కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉన్నట్లు కెనడా ప్రధాని ట్రూడో వ్యాఖ్యలు చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో టొరంటోకు సమీపంలోని మిసిసాగా సిటీలో ఈ నెల 12న జరిగిన దీపావళి వేడుకలపై ఖలిస్థానీ తీవ్రవాదులు దాడి చేశారు. ఖలిస్థానీ జెండాలతో వచ్చిన రాడికల్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విధ్వంసం సృష్టించారు. ఆనందోత్సాహాలతో పండుగ చేసుకుంటున్న భారతీయులపై రాళ్లు, చెత్త విసిరారు. పోలీసులు మౌన ప్రేక్షకులుగా మిగిలిపోయారు. మిసిసాగా సిటీ కౌన్సిలర్ కరోల్ పర్రిష్ మాట్లాడుతూ, పోలీసుల స్పందన దారుణంగా ఉందని, దీన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు.

గిరిజనుల్ని
ఓడించాలి
రాజస్థాన్ బీజేపీ అభ్యర్థి వ్యాఖ్యలు

జైపూర్, నవంబర్ 14: రాజస్థాన్ బీజేపీ ఎంపీ, తిజారా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి బాబా బాలక్‌నాథ్ సోమవారం భివాడీ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఆ కబిలస్(గిరిజనులు) ఏకమయ్యారు. మనం ఓటింగ్ శాతం ద్వారా వాళ్ల ప్రణాళికలను ఓడించాలి. దాంతో వాళ్లు భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఏకమై మన సనాతన ధర్మాన్ని ఓడించే సాహసం చేయరు' అని ఆయన అన్నారు. అయితే కబిలస్ ఎవరనే దానిపై ఆయన మరిన్ని వివరాలు వెల్లడించలేదు. ఎన్నికలను ఆయన ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్‌తో పోల్చారు.

హమాస్ పార్లమెంట్‌పై
ఇజ్రాయెల్ జెండా

న్యూఢిల్లీ : గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) గట్టి పట్టు సాధించాయి. హమాస్ నడుపుతున్న పార్లమెంటు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఐడీఎఫ్ మంగళవారం ప్రకటించింది. ఉగ్రవాదులు అక్టోబరు 7న ఇక్కడి నుంచే ఇజ్రాయెల్‌పై దాడి చేశారని తెలిపింది. హమాస్ ఉగ్రవాదులతో భీకర పోరు జరుగుతున్నదని, సాధారణ పౌరులు దక్షిణ ప్రాంతానికి వెళ్లిపోయేందుకు వీలుగా మానవతావాద కారిడార్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. ఓ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ భవనాన్ని స్వాధీనం చేసుకున్నామని, దీనిలో ఆయుధాలను తయారు చేస్తున్నారని వెల్లడించింది.

17న తెరుచుకోనున్న
శబరిమల ఆలయం

తిరువనంతపురం: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఈ నెల 17న తెరుచుకోనుంది. ఈ ఏడాది మండల- మకరవిళక్కు వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయి. అయ్యప్ప స్వామి భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు కేరళ మంత్రి కే రాధాకృష్ణన్ మంగళవారం చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు డైనమిక్ క్యూ కంట్రోల్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామన్నారు.

వ్యవస్థల భ్రష్టు!

- గవర్నర్లతో విపక్ష పాలిత రాష్ట్రాలపై పెత్తనం
- దర్యాప్తు సంస్థలతో ప్రత్యర్థి పార్టీలకు బెదిరింపులు
- న్యాయవ్యవస్థ, ఈసీపైనా పెత్తనానికి పావులు
- రాజకీయ ప్రచారానికి సైన్యం, బ్యూరోక్రాట్లు
- కాగ్‌ను పనిచేయనీయకుండా కపట యత్నాలు
- ఐఐఎంల స్వతంత్రతను దెబ్బతీసేలా నిబంధనలు
- అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న మోదీ సర్కారు



న్యూఢిల్లీ, నవంబర్ 14: దేశంలోని అన్ని రాజ్యాంగ, స్వయంప్రతిపత్తి సంస్థలను కేంద్రంలోని మోదీ సర్కారు భ్రష్టుపట్టిస్తున్నది. న్యాయవ్యవస్థ నుంచి దర్యాప్తు సంస్థల వరకు, గవర్నర్ల వ్యవస్థ నుంచి కాగ్ వరకు అన్ని వ్యవస్థల స్వతంత్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నది. తాజాగా దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా ఉన్న ఐఐఎంల స్వతంత్రతకు చెల్లుచీటి ఇచ్చి, వాటిపై రాష్ట్రపతికి విశేష అధికారాలు కల్పించడం చర్చనీయాంశం అయింది. మోదీ సర్కార్ తీరుపై మేధావులు, విద్యావేత్తలు, రాజకీయ వర్గాల నుంచి తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. నియంతృత్వ ధోరణికి ఇది దారి తీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐఐఎంల స్వతంత్రతకు చెల్లు

ఐఐఎంలపై రాష్ట్రపతికి విశేషాధికారాలు కల్పిస్తూ కేంద్రం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఐఎం స్వతంత్రతను దెబ్బతీసేలా తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం దేశంలోని అన్ని ఐఐఎంలకు రాష్ట్రపతి 'విజిటర్'గా ఉంటారు. బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్, డైరెక్టర్ల నియామకం లేదా తొలగింపుపై రాష్ట్రపతికి అధికారం ఉంటుంది. బోర్డును రద్దు చేసే అధికారం కూడా రాష్ట్రపతికి కల్పించారు. కొత్త డైరెక్టర్ల నియామకానికి సంబంధించి సెర్చ్ ప్యానెళ్ల నియామకం, పాలసీ నిర్ణయాలు, వార్షిక బడ్జెట్ల ఆమోదం, ఫీజుల నిర్ణయం వంటి అంశాలపై కూడా రాష్ట్రపతికి అధికారం ఉంటుంది. అంత కుముందు ఈ బోర్డు రద్దు క్లాజ్ ఉండేది కాదు. డైరెక్టర్ల నియామకంలో బోర్డుకే పూర్తి అధికారం ఉండేది.

వివాదాస్పదంగా గవర్నర్ల తీరు

విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకొనేందుకు, ఆయా రాష్ట్రాలపై పెత్తనం చేసేందుకు గవర్నర్ల ద్వారా బీజేపీ సర్కార్ కుట్రలు చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పంజాబ్, బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో గవర్నర్ల వైఖరి వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా తొక్కిపెట్టడంపై సుప్రీంకోర్టు కూడా ఇటీవల అక్షింతలు వేసింది. గవర్నర్లు నిప్పుతో చెలగాటమాడుతున్నారని మండిపడింది.

ఈసీని కీలుబొమ్మగా మార్చేలా..

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలి. లేకపోతే వినాశకర పరిణామాలు తలెత్తుతాయి. అటు వంటి ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఎన్నికల కమిషన్‌పై కూడా పెత్తనం చేయాలని, ఈసీని తమ అదుపాజ్ఞల్లోకి తీసుకోవాలని కేంద్రం చూస్తున్నది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీ) నియామకాలను నియంత్రించేలా కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. కమిషనర్ల నియామకాల త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)ని తొలగించింది. కొత్త బిల్లు ప్రకారం.. కమిటీలో ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ స్థానంలో క్యాబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఇది ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తుందని, ఎన్నికల సంఘాన్ని కీలుబొమ్మగా మారుస్తుందని, తమకు ఇష్టం వచ్చిన వ్యక్తులను ఎన్నికల కమిషనర్లుగా నియమించుకొనేందుకు ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తుందని విపక్ష నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీంకోర్టు కొలీజియం టార్గెట్‌గా కేంద్రం

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాలు, బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు, కేంద్రానికి వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్న కిరణ్ రిజిజు కొలీజియం వ్యవస్థను విమర్శిస్తూ పలుమార్లు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ సర్కార్ కొలీజియం స్థానంలో నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్(ఎన్‌జేఏసీ) తీసుకురావాలని కూడా ప్రయత్నించింది. అయితే దీన్ని సుప్రీంకోర్టు కొట్టేసింది. కొలీజియం సిఫారసులకు ఆమోదం తెలుపడంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి.

భారీగా పడిపోయిన కాగ్ నివేదికలు

ఆర్థిక అవకతవకలను నిగ్గు తేల్చే కాగ్‌ను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ సర్కార్ కంకణం కట్టుకొన్నది. కాగ్ స్వతంత్రతకు పాతర వేస్తున్నది. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల ఆడిటింగ్‌కు కీలకమైన ఫీల్డ్‌వర్క్‌ను వెంటనే ఆపేయాలంటూ కాగ్ అధికారులకు గత నెల 'మౌఖిక ఆదేశాలు' జారీ చేయడం వివాదాస్పదమైంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుతో పాటు ఆయుష్మాన్ భారత్, భారత్‌మాల పథకాల్లో జరిగిన అవినీతిని బట్టబయలు చేసిన ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లను కేంద్రం ఇటీవలే బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే. మరోవైపు మోదీ పాలనలో కాగ్ నివేదికలు కూడా ఏటికేటికి తగ్గుముఖం పడుతున్నాయి. 2015లో కాగ్ 54 నివేదికలు విడుదల చేయగా.. 2023లో ఆ సంఖ్య 16కి పడిపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాగ్ స్వతంత్రత దెబ్బతినకుండా చూడాలని కోరుతూ 86 మంది మాజీ ఉన్నతాధికారులు రాష్ట్రపతి ముర్ముకు ఇటీవల లేఖ రాశారు.

రాజకీయ కక్షకు సాధనాలుగా దర్యాప్తు సంస్థలు

మోదీ సర్కార్ పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం గురించి చెప్పనవసరం లేదు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను విపక్ష పార్టీల నేతలపైకి కేంద్రం ఉసిగొల్పుతున్నది. బీజేపీ నేతలపై వచ్చే అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టేందుకు ముందుకు కదలని దర్యాప్తు సంస్థలు.. విపక్ష పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించి, వేధింపులకు గురిచేస్తున్నాయని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మోదీ సర్కార్ పాలనలో నమోదైన సీబీఐ, ఈడీ, ఐటీ కేసుల్లో దాదాపు 90 శాతం కేసులు విపక్ష నేతలపైనే కావడం గమనార్హం.

సైన్యంతో పథకాల ప్రచారమా?

ఎన్నికల వేళ బీజేపీ తన రాజకీయ లబ్ధి కోసం సైన్యాన్ని, అధికారులను వాడుకొంటున్నది. దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని ఇటీవల సైన్యానికి ఆదేశాలు ఇవ్వడం దుమారం రేపింది. మరోవైపు తమ ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం బ్యూరోక్రాట్లను కూడా రంగంలోకి దించింది. కేంద్ర ప్రభుత్వంలోని 12 శాఖలకు చెందిన అధికారులను రథ్ ప్రభారిస్(ప్రత్యేక అధికారులు)గా నియమించి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో వారి ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను 'మార్కెటింగ్' చేసుకోవాలని పథకం రచించింది.

కర్ణాటకలో కరెంటు బిల్లుల మోత

మొదటిపేజీ తరువాయి...

ఎడాపెడా బిల్లుల మోత మోగిస్తున్నది. 'గృహజ్యోతి' స్కీమ్ కింద 200 యూనిట్ల వరకు అందరికీ ఉచిత విద్యుత్తు ఇస్తామంటూ హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన హస్తంపార్టీ సంబంధంలేని నిబంధనలతో ప్రజలను మోసగిస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 2.14 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందనుకొన్న ఈ స్కీమ్.. కొత్త నిబంధనల కారణంగా కేవలం 8 లక్షల మందికే పరిమితమయ్యే ప్రమాదం ఏర్పడింది. కిందటేడాది గృహ విద్యుత్తు వినియోగం సగటున 200 యూనిట్లకు మించని కుటుంబాలు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులంటూ సర్కారు తొలి షాక్ ఇచ్చింది. 200 యూనిట్ల స్థానంలో పరిమితిని 165 యూనిట్లకు కుదిస్తూ మరో షాక్ ఇచ్చింది. ఇక, 166వ యూనిట్ నుంచి ఎంత వినియోగిస్తే అంత మొత్తానికి బిల్లు (యూనిట్‌కు రూ. 7 చొప్పున) చెల్లించాలని మూడో షాక్ ఇచ్చింది. కొత్తగా కనెక్షన్ తీసుకొన్న వారికి 59 యూనిట్ల వరకు మాత్రమే మినహాయించి 60 యూనిట్ నుంచి 100 యూనిట్ల వరకు రూ.5.6 చొప్పున.. వంద దాటితే యూనిట్‌కు రూ. 7 చొప్పున బిల్లు విధిస్తామని ఇంకో షాక్ ఇచ్చింది. ఇప్పుడు తాజాగా ఎక్స్‌ట్రా ఫ్యూయెల్ అడ్జస్ట్‌మెంట్ కాస్ట్ (ఎఫ్‌ఏసీ) పేరిట యూనిట్‌కు 85 పైసలను అదనంగా పెంచింది. ఈ మేరకు బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ (బీఈఎస్‌సీవోం) ప్రకటించింది. ఈ నవంబర్ నుంచే పెంచిన ధర అమల్లోకి వస్తుందని, డిసెంబర్ బిల్లులో ఇది జోడిస్తామని వివరించింది. దీంతో కాంగ్రెస్ సర్కారుకు పగ్గాలు అప్పగించి తప్పు చేశామని కర్ణాటక ప్రజలు లబోదిబోమంటున్నారు.

టారిఫ్‌ల వాత

అటు ప్రజలపై బిల్లుల మోత మోగించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పరిశ్రమలను కూడా విడిచిపెట్టలేదు. మూడేండ్లకు గానూ స్పెషల్ పవర్ టారిఫ్‌ను తీసుకొస్తున్నట్టు పారిశ్రామికవేత్తలకు సర్కారు తాజాగా షాక్ ఇచ్చింది. కరెంటు బిల్లులపై వినియోగదారులకు కచ్చితమైన అవగాహన ఉండటానికే మల్టీ-ఇయర్-టారిఫ్స్ (ఎంవైటీ)ని తీసుకొచ్చినట్టు కర్ణాటక ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (కేఈఆర్‌సీ) వెల్లడించింది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై కర్ణాటక చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఎఫ్‌కేసీసీఐ) మండిపడింది. దేశంలోని మిగతా రాష్ట్రాలు ఎంవైటీ విధానాన్ని తీసుకురాకముందే, ఎలాంటి అధ్యయనం చేయకుండానే కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా నిర్ణయం వినియోగదారులకు, ముఖ్యంగా పరిశ్రమలకు పెను భారమేనని ఆందోళన వ్యక్తం చేసింది. ఎప్పుడో మూడేండ్ల తర్వాత నిర్ణయించాల్సిన విద్యుత్తు రుసుములను ఇప్పుడే ముందస్తుగా ఎలా నిర్ణయిస్తారని, ఇది దోచుకోవడమేనని ధ్వజమెత్తింది. ఇలాంటి విధానాలతో కంపెనీలు, పరిశ్రమలను ఎలా నడపాలని ఆవేదన వ్యక్తం చేసింది.

ఎస్సైని ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన ఇసుక మాఫియా
ఇలాంటివి మామూలేనన్న బీహార్ మంత్రి

పాట్నా : ఓ ఎస్సైని ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తే అదేమీ కొత్త విషయం కాదంటూ బీహార్ విద్యాశాఖ మంత్రి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇలాంటివి మామూలేనని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనూ జరిగాయని ఉదహరించారు. ఆయన వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడుతున్నాయి. జాముయ్ జిల్లాలోని మహులియా తాండ్ గ్రామంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకునేందుకు గర్హి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ప్రభాత్ రంజన్ ప్రయత్నించారు. ఏమాత్రం ఖాతరు చేయని ట్రాక్టర్ డ్రైవర్ ఆయనను ఢీకొట్టాడు. కిందపడిన ప్రభాత్ పైనుంచి ట్రాక్టర్‌ను పోనిచ్చాడు. తీవ్రంగా గాయపడిన ప్రభాత్‌ను దవాఖాన తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

గంటకు 23 మందిపై వేటు!

- ఈ ఏడాది 2.5 లక్షల మందికిపైగా ఉద్వాసన
- టెక్ కంపెనీల్లో యథేచ్ఛగా ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ : టెక్ కంపెనీల్లో గత రెండేండ్ల నుంచి ఉద్యోగుల తొలగింపులు (లేఆఫ్స్) అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 2.5 లక్షల మందికిపైగా ఉద్యోగాలను కోల్పోయారు. ఇది నిరుటి కంటే 50 శాతం అధికం. అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజాలతోపాటు చిన్న చిన్న ఫిన్‌టెక్ స్టార్ట్‌ప్‌లు, యాప్‌లు ఉన్నాయి. నవంబర్ 11 వరకు 1,106 కంపెనీలు 2,48,974 మంది ఉద్యోగులను తొలగించాయని, నిరుడు ఇదే సమయంలో 1,54,336 మంది ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారని 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' వెబ్‌సైట్ వెల్లడించింది. గత రెండేండ్లలో సగటున గంటకు 23 మంది లేదా రోజుకు 555 మంది ఉద్యోగాలను కోల్పోయారని, ఈ ఏడాది జనవరిలోనే వివిధ కంపెనీలు 89,554 మంది ఉద్యోగులను తొలగించాయని స్పష్టం చేసింది. రిటైల్ టెక్, కన్జ్యూమర్ టెక్ రంగాల్లో ఉద్యోగుల తొలగింపు ఎక్కువగా జరిగిందని, ఈ సంవత్సరం ముగిసేలోగా మరింత మంది ఉద్యోగులపై వేటు పడటం ఖాయమని పేర్కొన్నది.

దళితులు బీజేపీలో ఎదగలేరు
కర్ణాటక బీజేపీ ఎంపీ రమేశ్ వ్యాఖ్యలు

బెంగళూరు, నవంబర్ 14: దళితులకు బీజేపీలో చోటు ఉండదని.. ఒకవేళ ఒక్కరో ఇద్దరో ఉన్నా వాళ్లు పార్టీలో ఎప్పటికీ ఎదగరని మరోసారి రుజువైంది. సాక్షాత్తూ బీజేపీకి చెందిన ఎంపీనే ఈ విషయం వెల్లడించారు. కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ రమేశ్ జాగజినాగి మాట్లాడుతూ 'నీవు దళితుడివి అయితే బీజేపీలో ఎప్పటికీ ఎదగలేవు. అసలు ఎదిగే అవకాశమే రాదు. బీజేపీకి దళితులన్నా, వాళ్ల ఎదుగుదల అన్నా అస్సలు నచ్చదు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ విధానం మరోసారి బయటపడింది. ఇందుకు నిదర్శనమే కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా మాజీ సీఎం యెడియూరప్ప కుమారుడు విజయేంద్రను నియమించడం' అని పేర్కొన్నారు. బీజేపీలో ధనవంతులదే రాజ్యమని, వీరికి మద్దతు తెలుపడానికి చాలా మంది ముందుకు వస్తుంటారని రమేశ్ చెప్పారు. అదే పేదవాడైన దళితుడికి మద్దతు తెలుపడానికి ఒక్క నేత కూడా ముందుకురారని పేర్కొన్నారు. బీజేపీ డీఎన్‌ఏలోనే దళిత వ్యతిరేకత ఉందన్నారు.తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తిని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించిందని, ఇంతకన్నా దురదృష్టం మరొకటి ఉండదని పేర్కొన్నారు.

వ్యభిచారాన్ని నేరంగా పరిగణించాలి
పార్లమెంటరీ ప్యానల్ సిఫారసు

న్యూఢిల్లీ : వ్యభిచారాన్ని నేరంగా పరిగణించాలని భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం మంగళవారం కేంద్రానికి సిఫారసు చేసింది. వివాహ వ్యవస్థ చాలా పవిత్రమైనదని, దానిని తప్పనిసరిగా పరిరక్షించాలని తెలిపింది. వ్యభిచారాన్ని నేరంగా పరిగణించడంలో స్త్రీ, పురుష భేదాలేవీ ఉండకూడదని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలిపింది. ఈ నేరానికి పాల్పడే స్త్రీ, పురుషులకు సమాన బాధ్యత ఉండేలా చూడాలని తెలిపింది. ఈ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆగస్టులో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. వ్యభిచారం నేరం కాదని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం 2018లో తీర్పు చెప్పింది. ఈ తీర్పును తోసిపుచ్చుతూ, వ్యభిచారాన్ని నేరంగా పరిగణించడాన్ని పునరుద్ధరించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లకు బదులుగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టారు. వీటిని పరిశీలించి, తగిన సిఫారసులు చేయడం కోసం హోం శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపించారు.

అదానీ చేత.. అదానీ కోసం..

- కేంద్ర పర్యావరణ శాఖలో అదానీ గ్రూపు ఉద్యోగి
- ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీలోకి జనార్ధన్ చౌదరి
- అదానీ కంపెనీలకు అనుమతులిచ్చింది ఈ కమిటీయే
- అదానీ గ్రీన్ ఎనర్జీకి జనార్ధన్ ముఖ్య సలహాదారు
- అదానీ గ్రీన్ ఎనర్జీ ఆరు యూనిట్లకు కమిటీ అనుమతి
- ఎవరి కోసం జనార్ధన్‌ను ఎవరు నియమించారు?
- ఇది పక్కా పరస్పర ప్రయోజక నియామకం:విపక్షాలు

న్యూఢిల్లీ, నవంబర్ 14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీకి కేంద్ర ప్రభుత్వం ఎంతగా సాగిలపడిందనేదానికి మరో రుజువు బయటకొచ్చింది. అదానీ గ్రూప్‌లోని అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్)కు ప్రధాన సలహాదారుగా ఉన్న వ్యక్తిని కేంద్ర పర్యావరణ శాఖ హైడ్రో ఎలక్ట్రిసిటీ, రివర్ వ్యాలీ ప్రాజెక్టులపై ఏర్పాటుచేసిన ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీలోకి తీసుకొన్నారు. అయితే ఏమిటి అంటారా? ఈ కమిటీ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలకు అనుమతులు ఇచ్చింది మరి.

ఏమిటీ వివాదం?

ఏజీఈఎల్ ప్రధాన సలహాదారు అయిన జనార్ధన్ చౌదరిని మోదీ సర్కారు కేంద్ర పర్యావరణ శాఖ పునర్వ్యవస్థీకరించిన నిపుణుల కమిటీలో నాన్ ఇన్‌స్టిట్యూషనల్ సభ్యుడిగా గత సెప్టెంబర్‌లో నియమించింది. అక్టోబర్‌లో ఈ కమిటీ ముందుకు ఏజీఈఎల్ మహారాష్ట్రలో నిర్మించ తలపెట్టిన 1,500 మెగావాట్ల తరలి పంపింగ్ స్టోరేజీ ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల కోసం వచ్చింది. అక్టోబర్ 17,18 తేదీలో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కమిటీ పరిశీలించింది. ఆ సమయంలో కమిటీలో జనార్ధన్ సభ్యుడిగానే ఉన్నారు. ఈ కమిటీ అదానీ గ్రూప్‌నకు చెందిన మొత్తం 10,300 మెగావాట్ల సామర్థ్యంగల ప్లాంటుకు పర్యావరణ అనుమతులు ఇచ్చింది.

మిత్రుడి కోసం

జనార్ధన్ చౌదరిని నిపుణుల కమిటీలో నియమించటంపై విపక్షాలు కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నియామకం పరస్పర ప్రయోజనం కూడా కాదని.. అంతకు మించి అని శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం మండిపడింది.

ఎందుకు తీసుకొన్నట్టు??

జనార్ధన్ చౌదరి నియామకం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నట్టు విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.8 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు గత డిసెంబర్‌లో అదానీ గ్రూప్ ప్రకటించింది. ఇందులో మెజారిటీ ప్రాజెక్టులు భారత్‌లోనే చేపట్టనున్నట్టు ప్రకటించిన ఆ గ్రూప్ ఈ మేరకు పెద్దయెత్తున నిధులను సేకరించింది. ఈ క్రమంలోనే ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులను మంజూరు చేయించడానికే పర్యావరణ నిపుణుల కమిటీలో జనార్ధన్ చౌదరి నియామకం జరిగినట్టు పలువురు చెబుతున్నారు.

పరస్పర ప్రయోజనం కూడా కాదు.. మిత్రుడి కోసం

జనార్ధన్ చౌదరిని నిపుణుల కమిటీలో నియమించటంపై విపక్షాలు కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. 'పర్యావరణ శాఖ పరిధిలోని ఈఏసీ సభ్యుడిగా అదానీ ఉద్యోగి జనార్ధన్ చౌదరిని అదానీ ప్రధాన్ సేవక్ నియమించారు' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఇది పరస్పర ప్రయోజనం కిందకు వస్తుందని విమర్శించింది. ఈ నియామకం పరస్పర ప్రయోజనం కూడా కాదని.. అంతకు మించి అని శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం మండిపడింది. 'ఒక్క ఈ మెయిల్ షేర్ చేసిసందుకే ఎన్నికైన పార్లమెంటు సభ్యురాలిని (టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర) ఎథిక్స్ కమిటీ జాతీయ భద్రతకు ముప్పు పేరుతో నేరస్తురాలిగా తేల్చింది. ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్న ఒక కంపెనీ ఉద్యోగిని.. ఆ ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చే కమిటీలోకి ఎలా తీసుకొన్నారు? దీనిపై దర్యాప్తు అవసరంలేదు. అతను అక్కడికి ఎలా వచ్చాడని తర్కించాల్సిన అవసరం కూడా లేదు.' అని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేదీ ట్వీట్ చేశారు.



మోదీ సర్కార్ పాలనలో నిత్యావరసరాల ధరల పెరుగుదల ఫలితంగా దుర్భలంగా మారిన పేదల బతుకులకు ప్రత్యక్ష సాక్ష్యం ఈ చిత్రం. దీపావళి సందర్భంగా అయోధ్యలో రికార్డు స్థాయిలో దీపోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు